క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న హనిమిరెడ్డి



పూజలు చేస్తున్న అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): మండలంలోని చవిటిపాలెం గ్రామంలో గురువారం అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టను వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంతమాగులూరు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కైపు మహేష్‌రెడ్డి, మండల, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.

6న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చీరాల: మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి గురువారం తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

పేదల గుండెల్లో సీఎం జగన్



రవికుమార్

చినగంజాం: రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేసి సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి పేదల గుండెల్లో గుడికట్టారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి మాచవరపు రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్రమ పొత్తులతో కూటమి అందలమెక్కడమే ధ్యేయంగా పెత్తం దారులంతా ఒక వైపు చేరి రానున్న ఎన్నికల బరిలో మూకుమ్మడిగా దిగుతున్నారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే అజెండాగా మేలు జరిగిందని భావిస్తేనే ఓటు వేయండని పిలుపునిస్తున్న ఏకైక దమ్మున్న సీఎం జగన్ మోహనరెడ్డి ఒక్కరే అన్నారు. యుద్ధానికి సిద్ధమైనట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు విద్యార్థులు, అటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమేనని మనమంతా ఐక్యంగా ఉండి జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పేర్కొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతు



చీరాల: రాబేయే ఎన్నికల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలి.. గతంలో జరిగిన విధంగా గొడవలు, ఘర్షణలు లేకుండా ప్రజలందరు సహకరించాలని టూటౌన్ సీఐ జి.సోమశేఖర్ సూచించారు. గురువారం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జయంతిపేట, జాన్‌పేట, మరియమ్మపేట, ఐక్యనగర్, విజయనగర్‌కాలనీతో పాటుగా శివారు కాలనీల్లో ప్రత్యేక బీఎస్ఎఫ్ పోలీసు బలగాలు, సివిల్ పోలీసులతో కవాతు నిర్వహించారు. గత ఎన్నికల సమయంలో ఘర్షణల నేపథ్యంలో ప్రధాన రహదారుల్లో కవాతు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, బెటాలియన్ పోలీసులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత

చీరాల అర్బన్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా నేషనల్ గ్రీన్ కోర్ కో–ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి అన్నారు. గురువారం ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో పేరాలలోని ఆంధ్రరత్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలందరూ పర్యావరణ హిత జీవనశైలిని అలవర్చుకునేలా గ్రామస్థాయి నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అనంతరం విద్యార్థులకు 'పర్యావరణాన్ని కాపాడండి–భూమిని రక్షించండి' అనే అంశంపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు బి.సాల్మన్‌రాజు, రాజేంద్రప్రసాద్, జి.బాలశంకరరావు, టీచంద్రశేఖర్ పాల్గొన్నారు.

వేటపాలెం: ప్రతి విద్యార్థి మొక్కలు నాటడం వల్ల బావితరాల వారి భవిష్యత్‌ను కాపాడు కోవచ్చని బాపట్ల ఏపీ ఎన్‌జీసీ కోఆర్డినేటర్ పి బానుచంద్ర మూర్తి సూచించారు. రైల్వే స్టేషన్ రోడ్డులోగల జిల్లా పరిషత్ బాలి కోన్నత పాఠశాల్లో ఏపీఎన్‌జీసీ ఆధ్వర్యంలో ఎన్విరాల్ మెంట్ పై అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ, ఎన్‌జీసీ కోఆర్డినేటర్ ఎం జనమ్మ, సరళాదేవి, పార్వతి, ఏవీ సుబ్బారావు, హితవచన పాల్గొన్నారు.

బాబు కుట్రలు.. వృద్ధుల కష్టాలు

- రెండోరోజు పింఛన్‌దారులకు తప్పని తిప్పలు
- సచివాలయాల వద్ద పడిగాపులు పడుతున్న వృద్ధులు
- చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు శాపనార్థాలు పెడుతున్న వృద్ధులు

చీరాల రూరల్/జే.పంగులూరు: రెండో రోజు కూడా పింఛన్‌దారులకు తిప్పలు తప్పలేదు. చంద్రబాబు చేసిన కుట్రల కారణంగా పింఛన్‌దారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 14 సచివాలయాల పరిధిలోని 21 గ్రామాలకుగాను 7695 మంది వివిధ రకాల పింఛన్‌దారులు ఉన్నారు. వారికి ప్రతి నెల రూ.2.33 కోట్లు డబ్బులు పింఛన్ రూపంలో గతంలో వలంటీర్లు ప్రతి నెల 1వ తేదీనే పంపిణీ చేసేవారు. మొదటి రోజు పింఛన్‌దారులు సచివాలయాలు చుట్టూ తిరగడం సరిపోయింది. రెండో రోజైన గురువారం కొన్ని సచివాలయాలు ఉదయం 8 గంటల నుంచి పింఛన్ పంపిణీ చేయగా, కొన్ని సచివాలయాలు డబ్బులు రాలేదని కొంత మేర ఆలస్యం అయ్యింది. లైన్‌లో నిల్చొని వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంగులూరు గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ గుడిపూడి నాగేంద్ర రామారావు పింఛన్‌దారులు ఇబ్బందులు పడకుండా వారికి నీడ నిమిత్తం టెంట్లు, కుర్చీలు, మంచినీరు నీరు వసతి కల్పించారు. మధ్యాహ్నం సమయంలో వృద్ధులకు మజ్జిగ అందించారు. చంద్రబాబు హయంలో ఏవిధంగా అయితే వారు పింఛన్‌లు తీసుకోవటానికి ఏవిధంగా ఇబ్బందులు పడ్డారో ప్రస్తుతం అటువంటి ఇబ్బందులే వారు మళ్లీ పడుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పదవీ కాలంలో వారంతా ఎంతో సంతోషంగా వలంటీర్ల ద్వారా ఇళ్లవద్దనే పింఛన్‌లు తీసుకునేవారు. అటువంటిది చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు చేసిన నీచపు పనుల వలన గత కాలపు కష్టాలను గుర్తు చేసుకుంటూ పాతకాల రోజులు వస్తాయేమోనని వృద్ధులు ఆందోళన చెందుతున్నారు.



చీరాలలో మరియమ్మపేట సచివాలయం వద్ద పడిగాపులు పడుతూ చెట్టునీడలో సేదతీరుతున్న వృద్ధులు

అరకొరగానే పింఛన్ల పంపిణీ..

బల్లికురవ: బల్లికురవ మండలంలో లబ్ధిదారులకు రెండె రోజు కష్టాలు ఆరంభమయ్యాయి. మొదటి రోజు బుధవారం 3.30 గంటలనుంచి 5.30 గంటలకు వరకు చేతిలో ఉన్న సొమ్మును పంపిణీ చేసి మమ అనిపించారు. గురువారం బల్లికురవ, కొప్పరపాడు మినహా మిగిలిన సచివాలయాల్లో బ్యాంకుల నుంచి డబ్బు తెచ్చుకుని ఆలస్యంగా పంపిణీ చేపట్టారు.

అవ్వాతాతల అగచాట్లు..

మేదరమెట్ల: పింఛన్ తీసుకోవడం కోసం గ్రామ సచివాలయాలకు వచ్చే అవ్వాతాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొరిశపాడు మండలంలో గడచిన రెండు రోజులుగా సచివాలయాల వద్ద పింఛను అందచేయడంతో పింఛను దారులు పలు అగచాట్లు పడుతూ తమను పింఛను తీసుకునేందుకు ఇంటినుంచి మళ్లీ రోడ్డుపై పడేసిన చంద్రబాబును తిట్టుకుంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడచిన ఐదు సంవత్సరాలుగా ఉదయాన్నే ఇంటి వద్దకు వచ్చి ఇచ్చిన పింఛను తీసుకుంటుటే ఎంతో ఆనందంగా ఉండేదని వాపోతున్నారు.



రామకూరులో పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు



బల్లికురవలో పింఛన్ కోసం లబ్ధిదారుల కష్టాలు



ఉప్పుమాగులూరులో సచివాలయం ముందు కూర్చొన్న వృద్ధులు



పంగులూరు సచివాలయంలో పింఛన్ ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు



మేదరమెట్ల సచివాలయంలో పింఛను కోసం వేచి ఉన్న అవ్వాతాతలు

చంద్రబాబు ఇంత కుట్రలు చేస్తాడనుకోలేదు..



మా లాంటి ముసలోళ్లకు వచ్చే పింఛన్‌లు ఆపమని ఫిర్యాదులు చేయడం ఆయనకు తగదు. ఆ పాపం ఊరికేపోదు. తప్పకుండా ఈ సారి ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్తాం. మాలాంటి ముసలోళ్లతో ఓట్ల రాజకీయం చేయడం చంద్రబాబులాంటి పెద్ద నాయకుడికి ఇదేం పిచ్చిపని.

– ఎర్రగోపు యల్లమంద, చీరాల

చాలా కష్టంగా ఉంది..



నాకు కళ్లు సరిగా కనబడవు. కాళ్లు కూడా సహకరించక నడవలేని పరిస్థితి. ఇప్పటి వరకు వలంటీర్లు ఇంటికి వచ్చి ఫించన్ ఇచ్చే వాళ్లు. ఇప్పుడు పంచాయతీ దగ్గరికి వెళ్లి ఫించన్ తీసుకోవాలని చెప్తున్నారు. మాబోటి ముసలివాళ్లు అంతదూరం వెళ్లి పింఛన్ తీసుకోవాల్సి వచ్చింది. అధికారులు స్పందించి ఇంటివద్దకే ఫించన్ అందేలా చూడాలి.

– గొర్రెపాటి గురవమ్మ, పోలూరు

చంద్రబాబుకు గుణపాఠం తప్పదు..



జగనన్న పాలనలో గత నెల వరకు వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి ఫించన్ సొమ్ము ఇచ్చి వెళ్లేవారు. చంద్రబాబు కుట్ర వల్ల చాలా మంది వృద్ధులు ఓపిక లేకపోయిన మండు టెండలో సచివాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. వలంటీర్లను ఫించన్ పంపిణీ బాధ్యతల నుంచి తప్పించటం సరికాదు. వాళ్ల సేవలను రాజకీయాలతో ముడిపెట్టటం దుర్మార్గం.

– దేవగిరి నాగేశ్వరరెడ్డి, పూనూరు

అనారోగ్యంతో పింఛన్ కోసం వెళ్లడం కష్టంగా ఉంది..



అనారోగ్యం కారణంగా నేను పింఛను పంచాయతీకి వెళ్లి తెచ్చుకోలేని పరిస్థితి. వలంటీర్‌లను తీసేశారని తెలిసింది. వలంటీర్‌లు నేరుగా నాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఇంటికి పింఛను ఇచ్చేవారు. వేలి ముద్ర పడిందాకా ఉండి మరీ వేయించుకుని వెళ్లేవారు. అటువంటిది నేను ఈ పరిస్థితిలో ఏమి చేయాలో పాలుపోవడం లేదు. చంద్రబాబు ఇంతపని చేస్తాడనుకోలేదు.

– బదుగు యశోద, అంబేడ్కర్‌నగర్, చినగంజాం

వృద్ధులు, దివ్యాంగులపై ఎందుకీ కక్ష ?



చంద్రబాబుకు ఏదైనా సేవ చేయాలని ఉంటే ఎన్నికల బరిలో గెలిచి తన సత్తా చూపించుకోవాలి కాని, ఓపిక లేని వృద్ధులు, వికలాంగులు మీద తన ప్రతాపం చూపడం కరెక్ట్ కాదు. అందునా సేవ చేస్తున్న వలంటీర్‌లను పక్కన పెట్టించి తానేమి సాధిద్దామనో అర్థం కావడం లేదు. నిరుద్యోగులు వారు.. కాస్తోకూస్తో గౌరవ వేతనంతో సేవ చేస్తుంటే వారిపై అంత కక్ష చంద్రబాబుకు ఎందుకో ?

– గంగులపాటి వెంకట నరసయ్య , చినగంజాం

నా కూతురి పింఛన్ కోసం తిరుగుతున్నా..



నా కూతురు పుట్టుకతోనే దివ్యాంగురాలు. జగనన్న ప్రభుత్వంలోనే నా బిడ్డకు పింఛన్ వచ్చింది. బిడ్డకు పింఛన్ వచ్చిన నాటి నుంచి వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారు. కాని ఈనెల పింఛన్ తీసుకునేందుకు రెండు రోజుల నుంచి ఇంటి వద్దనే ఉంటున్నా. బుధవారం ఇస్తామన్నారు ఇవ్వలేదు. మళ్లీ గురువారం ఇస్తామన్నారు. ఇప్పటికి పింఛన్ కోసం ఎండలో బిడ్డను ఎత్తుకొని రెండు సార్లు వచ్చా.

– కుటుంబరావు, పంగులూరు

అన్ని పథకాలు తీసుకున్నాం..



సీఎం జగన్ మోహన్‌రెడ్డి వలన ఈ నాలుగున్నరేళ్ల కాలంలో ఎటువంటి కష్టం లేకుండా అన్ని పథకాలు తీసుకున్నాం. రాజశేఖరరెడ్డి మాకు అప్పట్లో ఇల్లు ఇచ్చాడు, ఆ ఇంటిలోనే ఉంటున్నాం. రేషన్ బియ్యం ఇంటికి తెచ్చి ఇస్తున్నారు. పింఛన్‌లు ప్రతినెలా ఇంటికి తెచ్చి వలంటీర్లు అందిస్తున్నారు. చంద్రబాబు మాత్రం వచ్చే పింఛన్‌లు ఆపివేయించాడు. ఆయన కనుక చంద్రబాబు సీఎం అయితే మా బతుకులు కాలిపోతాయి.

– కుంచాల పున్నమ్మ, రోశయ్య కాలనీ, చీరాల

వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయం



గ్రామస్తులతో మాట్లాడుతున్న అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి

- ఇంటింటా ప్రచారంలో అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ప్రజారంజక పాలన అందించిన జగనన్నను మళ్లీ సీఎంను చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అద్దంకి వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి సంతమాగులూరు మండలంలోని వెల్లలచెరువు గ్రామంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి ప్రచారపత్రాలను అందజేస్తు ప్రతి ఒక్కరికిని ఆప్యాయంగా పలకరించారు. తమ సమస్యలను తెలుసుకున్నారు. మాటతప్పని మడమతిప్పని జగనన్న ఇచ్చిన హామీలన్ని నెరవేర్చారన్నారు. ప్రతి ఇంటిలో మేలు జరిగితేనే ఓటు వేయమని చెప్పేదమ్ము దేశంలో ఒక్క జగనన్నకే ఉందన్నారు. సంక్షేమ పథకాలు, పింఛన్‌లు, రేషన్ ఇంటికివచ్చి అందించే జగనన్న ప్రభుత్వం కావాలో, జన్మభూమి కమిటీలతో ఎదరుచూసే ప్రభుత్వం కావాలో ఒక్కసారి ఆలోచించాలని కోరారు. ఒంటరిగా గెలవలేని బాబు జనసేన, బీజేపీతో పొత్తు పెట్టుకుని మరోసారి మోసం చేసేందుకు ప్రజల వద్దకు వస్తున్నారన్నారు. వచ్చే సార్వత్రి ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్‌కు, అద్దంకి అసెంబ్లీ అభ్యర్థిగా తనకు, రెండుసార్లు బటన్ నొక్కి ఆశీర్వదించాలన్నారు. వలంటీర్లపై విషం చిమ్ముతున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లపై అవ్వాతాతలు ఆగ్రహం వ్యక్తం చేసి తమ ఓటు జగనన్నకే వేస్తామని హనిమిరెడ్డికి తెలిపారు. ఈప్రచార కార్యక్రమంలో మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



ప్రచారంలో చిన్నారిని ఎత్తుకున్న హనిమిరెడ్డి

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామా



రాజీనామా చేసిన వల్లాపల్లి వలంటీర్లు



గంగవరంలో రాజీనామాలు సమర్పిస్తున్న వలంటీర్‌లు

బల్లికురవ: కుల,మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు, ఇంటింటికి పింఛన్లు, అందిస్తున్న తమపై ప్రతిపక్షాలైన టీడీపీ, జనసేన అవాకులు చవాకులతో సేవలను అడ్డుకోవటం తమను మనస్తాపానికి గురిచేసిందని వల్లాపల్లి సచివాలయ వలంటీర్లు వాపోయారు. గురువారం గ్రామ సర్పంచ్ మందా మోహన్‌రావు, సొసైటీ అధ్యక్షుడు మంచాల శ్రీనివాసరెడ్డి వైఎస్సార్ సీపీ నేత గొట్టిపాటి వెంకటరావు ద్వారా సచివాలయ సెక్రటరీ వీఏఆర్ ఖాన్‌కు 10 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలు అందజేశారు. అనంతరం అద్దంకి వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డిని కలిసి త్వరలో జరిగే ఎన్నికల్లో అసెంబ్లీగా మీ విజయానికి, బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ విజయానికి కృషి చేసి జగనన్న రెండో సారి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపడతారని వలంటీర్లు ప్రకటించారు.

గంగవరంలో ఏడుగురు..

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని గంగవరం గ్రామ సచివాలయ పరిధిలో గురువారం ఏడుగురు గ్రామ వలంటీర్‌లు తమ రాజీనామాలను సమర్పించారు. తమ వ్యక్తిగత కారణాల వలన రాజీనామాలను సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు తమ రాజీనామాలను గ్రామ కార్యదర్శి కే బాలాజీకి అందజేశారు. నిరుద్యోగులైన తమకు గత ఐదేళ్లుగా భృతిని కల్పించిన సీఎం జగన్ మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంగా తెచ్చుకోవాల్సిన అవసరం ఉందని వారు ఈ సందర్భంగా అన్నారు. వారి రాజీనామాకు సంబంధించి సర్పంచ్ బెల్లం సుధాకర్‌కు తెలియజేశారు.

వైవీ ప్రమాణ స్వీకారానికి తరలిన నాయకులు



ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన నియోజకవర్గ నాయకులు

మేదరమెట్ల/అద్దంకి రూరల్ : మేదరమెట్ల గ్రామానికి చెందిన వైవీ సుబ్బారెడ్డి రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారోత్సవం గురువారం ఢిల్లీలో జరిగింది. ఈసందర్భంగా అద్దంకి నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, వైవీ కుటుంబ సభ్యులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారం సందర్భంగా ఢిల్లీలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైవీ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైవీ భద్రారెడ్డి, కోటా శ్రీనివాసకుమార్, కాకాని రాధాకృష్ణమూర్తి, జజ్జర ఆనందరావు, ఈదా శ్రీనివాసరెడ్డి, జంపు హరిబాబు, కోయి అంకారావు, కే.నరసారెడ్డి, బొనిగల మధు, యల్లమందరావు, జమ్ములమడుగు హనుమంతరావు, వెంకటరెడ్డి, నరసారెడ్డి తదితరులు ఉన్నారు.

ఎంపీ సురేష్‌ను కలిసిన పార్టీ శ్రేణులు



ఎంపీని కలిసిన వల్లాపల్లి సర్పంచ్, స్థానిక నేతలు

బల్లికురవ: బాపట్ల ఎంపీగా రెండోసారి పోటీ చేసేందుకు అవకాశం దక్కిన నందిగం సురేష్‌ను గురువారం వల్లాపల్లి సర్పంచ్ మందా మోహన్‌రావు, స్థానిక నేతలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీ నివాసం ఉద్దండరాయునిపాలెం వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్టీలు కులమతాలకు అతీతంగా అందిస్తున్న సంక్షేమ పథకాలే మీ విజయానికి సోపానాలు అవుతాయన్నారు. ఎన్నికల ప్రచారానికి గ్రామానికి రావాలని సర్పంచ్ కోరారు. షెడ్యూల్ ప్రకారం నియోజకవర్గంలో పర్యటిస్తానని, అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి విజయానికి మీరంతా కృషి చేయాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో మందా సుబ్బారావు, చిన పిచ్చయ్య, బీ. దావీదు, కొండ్రు చిన్న తదితరులు ఉన్నారు.

అధిక ధరలకు విక్రయాలు చేస్తే చర్యలు

చీరాల టౌన్: ఎమ్మార్పీ కంటే అదనంగా ఆహార ఉత్పత్తులు అమ్మకాలు సాగించే వ్యాపారులపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని తూనికలు, కొలతలు శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ పి.లిల్లీ హెచ్చరించారు. గురువారం చీరాల పట్టణం, పరిసర ప్రాంతాల్లో వ్యాపార దుఖాణాల వద్ద తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేశారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కూల్‌డ్రింక్‌ను ఎమ్మార్పీ ధర రూ.68 ఉండగా అదనంగా రూ.75లకు అమ్మకాలు చేయడంతో బస్టాండ్‌లో అమ్మకాలు చేసే వ్యాపారి, మరో ఇద్దరు వ్యాపారులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చీరాల ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

పెన్షన్ల పంపిణీ వేగవంతం చేయాలి

వేటపాలెం: మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల వద్ద సామాజిక పెన్షన్లు వేగవతంగా పూర్తి చేయాలని సిబ్బందిని ఎంపీడీవో సీహెచ్ రూతమ్మ ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని గ్రామ సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో పరిశీలించారు. వృద్ధులు, వికలాంగులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పంపిణీలో జాప్యం చేసేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున తాగునీరు, టెంట్‌ల సౌకర్యంతో పాటు అత్యవసర వైద్య సర్వీసులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు.

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణ సచివాలయాల పరిధిలో 3983 మంది లబ్ధిదారులకు బుధ, గురువారాల్లో రూ.1.20 కోట్లు అందజేసినట్లు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. మిగిలినవి సచివాలయాలకు రాలేని వారిని గుర్తించి శుక్రవారం ఇంటి వద్దకు వెళ్లి అందజేసి నూరుశాతం పంపిణీ కార్యక్రమన్ని పూర్తిచేస్తామని తెలిపారు.

పాఠశాలల్లో వాటర్ బెల్స్ అమలు

కారంచేడు: విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురవ్వకుండా ఉండేందుకు అవసరమైన తాగునీటిని అమలు పరిచేలా వాటర్ బెల్స్ సమయాలను అమలు చేస్తున్నామని ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రస్తుత వేసవిలో అమలు అవుతున్న ఒంటిపూట బడుల్లో విద్యార్థులు ఎండ తీవ్రతను తట్టుకొనేలా ఈకార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఉదయం 8:45 గంటలకు, 10:50 గంటలకు, 11.50 గంటలకు మూడు సార్లు ఈ వాటర్ బెల్స్ మోగిస్తారన్నారు. ఈబెల్ కొట్టిన సమయంలో ప్రతి ఉపాధ్యాయుడు, విద్యార్థి కూడా మంచి నీటిని తాగాలని వారు కోరారు.

పీహెచ్‌సీల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

అద్దంకి రూరల్: డీఎంహెచ్‌వో ఎస్ విజయమ్మ గురువారం అద్దంకిలోని కాకానిపాలెంలోని యూపీహెచ్‌సీని ఆకస్మికంగా పరిశీలించారు. దీనిలో భాగంగా వైద్యశాలలోని నిర్వహిస్తున్న వైద్యసేవలను పర్యవేక్షించి, రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక భవాని సెంటర్‌లోని శానిటేషన్‌ను పరిశీలించి శానిటేషన్ మెరుగుపరచాలని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణతో మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి ఎం. హేమమాధురి, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

దావా సమను

మహా రాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 215/2022
Between :
చందోలు నాగేశ్వరరావు ...వాది
VS
నాగుబోయిన నాగభూషణం ..ప్రతివాది
To,
నాగుబోయిన నాగభూషణం S/o. సుబ్బారావు మేదరమెట్ల గ్రామం, పోస్టు, కొరిశపాడు మండలం, బాపట్ల జిల్లా.

పై నెంబరు దావాను వాది దావా పరిహారములు పొందు నిమిత్తం దాఖలు చేసియున్నాడు. సదరు దావాలో మీరు ప్రతివాది అయివుండి యిందును గురించి మీకు కోర్టు ద్వారా ఎన్ని సార్లు సమన్లు పంపినప్పటికి తీసుకొనక కాలాయాపన చేయుచున్నందున ఈ పత్రికా ప్రకటన ద్వారా దావా సమన్లు జారీ చేయవలసినదిగా కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చి ఉన్నారు. ఇందు నిమిత్తమై మీకు ఏమైనను అభ్యంతరములు ఉన్న యెడల **29-04-2024** తేది ఉదయం **10.30** ని॥లకు పై కోర్టు వారి యెదుట స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపవలెను. లేని యెడల మీ పరోక్షమందు విదారించి తీర్మానించబడునని ఇందు మూలకముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి అనుమతితో

అద్దంకి
తేది: 4-4-2024

పంచాగ్నుల రమేష్
అడ్వకేట్, అద్దంకి.
బాపట్ల జిల్లా.
సెల్: 9948788290

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
చీరాల డివిజన్
90101 55593 (చీరాల)
Office mail : sakshiongads@gmail.com